
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 13 । ఆగస్టు । 2025



18,910 క్యూసెక్కుల వరద

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 40.787 టీఎంసీలు ఉన్నాయి. 18,910 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 1850, కండలేరుకు 7 వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,02,850
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,295
3 శాతం జీఎస్టీతో	రూ.9,574
నవర (8 గ్రా)	రూ.76,592

గరిష్ఠం/కనిష్ఠం
31.6 /27.1

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా బుధవారం అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురుస్తాయని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. మంగళవారం గాలిలో తేమ 77 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

వైఎస్ జగన్‌కు రాఖీ కట్టిన కాకాణి పూజిత



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కాకాణి పూజిత దంపతులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత, డాక్టర్ అశ్వంత్‌రెడ్డి దంపతులు మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డిని కాకాణి పూజిత శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి రాఖీ కట్టారు.

జిల్లా అధికారులు, ఎంపీడీఓలకు రేపు శిక్షణ

నెల్లూరు (పొగతోట): పంచాయతీరాజ్ అడ్వాన్స్‌మెంట్ ఇన్‌డెక్స్‌పై ఈ నెల 14వ తేదీన లైన్ డిపార్ట్‌మెంట్స్ జిల్లా అధికారులు, డివిజనల్ అభివృద్ధి అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపీడీఓలు, ఉప మండల పరిషత్ అధికారులు, కంప్యూటర్ ఆపరేట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ మోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 14న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. శిక్షణ కార్యక్రమానికి అందరు తప్పకుండా హాజరుకావాలని తెలిపారు.

సీఐడీ కేసులో కాకాణికి బెయిల్ మంజూరు



నెల్లూరు (లీగల్): ప్రభుత్వ భూముల రికార్డులను తారుమారు చేశారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై పొదలకూరు పోలీసులు నమోదు చేసిన తర్వాత సీఐడీ అధికారులు దర్యాప్తు చేస్తున్న అక్రమ కేసులో బెయిల్ మంజూరు చేస్తూ నెల్లూరు 2వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎల్.శారదారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కొక్కరు రూ.25 వేలు ఆస్తి విలువ కలిగిన ఇద్దరు జామీన్‌దారులు పూచీకత్తు, రూ.25 వేలు వ్యక్తిగత బాండు కోర్టుకు సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. సీఐడీ పోలీసుల విచారణకు కాకాణి సహకరించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాకాణి తరఫున సీనియర్ న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, పి. ఉమామహేశ్వర్ రెడ్డి, ఎంవీ విజయకుమారి, సిద్ధన సుబ్బారెడ్డి వాదనలు వినిపిస్తూ ఈ కేసులో ప్రాథమిక ఆధారాలు లేకపోయినా, రాజకీయ కక్షతో గోవర్ధన్ రెడ్డిని 14వ నిందితుడిగా కేసు బనాయించారని వాదనలు వినిపించారు. అనంతరం పోలీసుల తరఫున ప్రత్యేక పీపీ మాల్యాద్రి వాదనలు వినిపిస్తూ కేసు దర్యాప్తు దశలో ఉందని కాకాణికి బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి శారదరెడ్డి గోవర్ధన్‌రెడ్డికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు.

బీజేపీ జేబు సంస్థగా ఈసీ



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు (వీఆర్సీసెంటర్): కేంద్ర ఎన్నికల కమిషన్‌ను బీజేపీ తన జేబు సంస్థగా మార్చేసుకుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నారపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని ఇందిరాభవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన ఓటు చోరీకి గురవుతోందని రాహుల్‌గాంధీ ఆధారాలతో నిరూపించి శాంతియుతంగా నిరసన చేస్తుండగా, పలువురు ఎంపీలను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యంలో చీకటి రోజు అన్నారు. దేశ ఎన్నికల కమిషన్‌ను ఏర్పాటు చేసే క్రమంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌ను పక్కన పెట్టి ఇష్టానుసారంగా బీజేపీ రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ సంజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు తలారి బాసుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కితే.. చలాన్ వాతే

➡ డీఎల్, ఆర్సీ కార్డుల పేరుతో ఖజానాకు 'రూ.కోట్ల'

- రూ.2.35 కోట్లకు పైగానే చెల్లించిన వాహనచోదకులు
- జిల్లాలో లక్ష వరకు డెలివరీ కాని కార్డులు
- డిజిటల్‌గా చూపించినా కేసుల నమోదు
- గత ప్రభుత్వంలో కార్డుల భారం లేకుండా డిజిటల్ విధానానికి ప్రాధాన్యత
- యాప్‌లో కార్డు చూపిస్తే రైట్‌రైట్

రోడ్డెక్కిన వాహనదారులను దోచుకునేందుకు కూటమి ప్రభుత్వం మాస్టర్ స్కెచ్ వేసింది. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డుల పేరుతో రూ.కోట్లను ఖజానాలో వేసుకుంది. కార్డులు జారీ చేయకుండా చలాన్ పేరుతో రూ.కోట్ల దోపిడీ చేస్తోంది. డిజిటల్ టెక్నాలజీకి తానే ఆద్యుడనని చెప్పుకునే సీఎం చంద్రబాబు, తిరిగి ఫిజికల్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాహనదారులకు కార్డుల భారం లేకుండా డిజిటల్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఫిజికల్‌గా కార్డు లేకపోయినా.. యాప్ ఓపెన్ చేసి చూపించినా సరిపోయేది. కూటమి ప్రభుత్వం వచ్చి దోపిడీకి తెర తీసింది. ఒక వైపు విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగించి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, మరో వైపు చలానాలు రాస్తూ వాహనచోదకుల జేబులకు చిల్లు పెడుతోంది.

నెల్లూరు(టౌన్): డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డుల విషయంలో వాహనదారుల పరిస్థితి సంకటంగా మారింది. కార్డుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి డబ్బులు చెల్లించినా జారీ చేయని పరిస్థితి. రవాణాశాఖలో సేవలు సులభతరం చేశామని, కార్యాలయానికి రాకుండానే అన్ని సేవలు మీ ముంగిట పొందవచ్చని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్, ఆర్సీ కార్డుల కోసం రవాణా కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటుంది. వాహనం రోడ్డు ఎక్కితే చాలు లైసెన్స్, ఆర్సీలు చూపించమని అటు రవాణా శాఖాధికారులు, ఇటు పోలీసు అధికారులు దబాయిస్తున్నారు. కార్డుల కోసం డబ్బులు చెల్లించామని, కార్డులు ఇంకా ఇవ్వలేదని చెప్పినా.. చలానా రాసి చేతిలో పెడుతున్నారు. కొంత మంది వ్యాలెట్ యాప్‌లో నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న కార్డును చూపితే అది ఒరిజనల్ లేక డూప్లికేటా మాకు తెలియదు కార్డు ఉంటే చూపించు వదిలివేస్తామని చెబుతున్నారు.


కార్డుల భారం తగ్గించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

జిల్లాలో నెల్లూరు ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంతోపాటు ఆత్మకూరు, కావలి, కందుకూరుల్లో రవాణాశాఖ కార్యాలయాలు ఉన్నాయి. ప్రతి రోజు జిల్లా వ్యాప్తంగా సగటున 500కు పైగా వాహన రిజిస్ట్రేషన్లు, పర్మినెంట్ లైసెన్స్‌లు జారీ చేస్తుంటారు. ఫిజికల్ కార్డుల కోసం ప్రభుత్వాలు అదనంగా ప్రతి కార్డుకు రూ.235 వసూలు చేసేవి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాహనదారులపై కార్డుల భారం తొలిగించింది. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డులను సెల్‌ఫోన్‌లో వ్యాలెట్ యాప్‌లో అందుబాటులో ఉంచింది. పోలీసు, రవాణా అధికారులకు అడిగినప్పుడు సేవ్ చేసుకున్న కార్డు చూపిస్తే సరిపోతుంది. పొరపాటున కార్డు మరిచిపోతే వాహనచోదకులపై చలాన్‌లు రాసే పరిస్థితి ఉండడంతో ఈ విధానానికి స్వస్తి పలికింది. డిజిటల్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది.



వాహనదారులపై అధికారుల వేధింపులు

వాహనం రోడ్డు ఎక్కితే చాలు పోలీసు, రవాణా అధికారులు తనిఖీ సమయంలో డ్రైవింగ్ లైసెన్స్,



వాహన ఆర్సీ కార్డు

ఆర్సీ కార్డులు చూపించమని వేధింపులు ఎక్కువయ్యాయంటూ వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్డులకు డబ్బులు చెల్లించినా డౌన్‌లోడ్ చేసుకున్న కార్డు చూపిస్తే సరిపోతుందనే ప్రభుత్వ మార్గదర్శకాలు ఎక్కడా లేకపోవడంతో ఫిజికల్ కార్డులు చూపించాలని, లేదంటే కేసులు, చలాన్ రాస్తామని చెబుతున్నారు. కొంత మంది అధికారులు వాహనదారులు డౌన్‌లోడ్ చేసుకున్న కార్డులు చూపిస్తే మిన్నకుంటున్నారు. ఎక్కువ మంది అధికారులు ఫైన్ విధిస్తుండడంతో వాహనదారులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికైనా కార్డు లు ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి ఉంది. కనీసం సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డులు చూపించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నారు. కార్డులను త్వరగా ముద్రించి వాహనదారులకు అందజేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

కార్డులు ఇంకా రాలేదు



డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డులు ఇంకా రాలేదు. కార్డులను ముద్రించాల్సి ఉంది. త్వరలోనే వాటిని ముద్రించి ఆయా జిల్లాలకు పంపుతారు. కార్డులు వచ్చిన వెంటనే వాహనదారులు ఇచ్చిన అడ్రస్‌కు వారి ఇళ్లకే పంపుతాం. కార్డుల కోసం రవాణా కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేదు.

– చందర్, డీటీసీ, నెల్లూరు

లైసెన్స్, ఆర్సీ కార్డుకు రూ.235 చెల్లింపు

డిజిటల్ టెక్నాలజీకి తానే ఆద్యుడనని గప్పాలు కొట్టుకునే చంద్రబాబు గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన డిజిటల్ విధానాన్ని స్వస్తి పలికడమే కాకుండా వాహనదారులను దోచుకుంటున్నారు. గతేడాది నవంబరు నుంచి మళ్లీ కార్డుల జారీ కోసం ప్రత్యేకంగా డబ్బులు చెల్లించుకోవడం ప్రారంభించారు. లైసెన్స్ జారీ, రిజిస్ట్రేషన్ సమయంలో ప్రభుత్వ చలానాతో పాటు కార్డుకు ప్రత్యేకంగా రూ.235 వసూళ్లు చేస్తున్నారు. గతేడాది నవంబరు నుంచి డబ్బులు చెల్లించినా వాహనదారులకు ఇంత వరకు కార్డులు అందలేదు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు లక్షకు పైగా లైసెన్స్, ఆర్సీ కార్డులు రావాల్సి ఉందని రవాణా అధికారులు చెబుతున్నారు. దాదాపు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డుల కోసం రూ.2.35 కోట్లకు పైగా డబ్బులు చెల్లించారు. ఇదంతా వాహనదారులను దోపిడీ చేసేందుకు ప్రభుత్వం మాస్టర్ స్కెచ్ వేసినట్లు అర్థమవుతోంది. కార్డుల విషయంలో నేటికి రాష్ట్ర ప్రభుత్వానికి క్లారిటీ లేదు. కార్డుల ముద్రణ రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టాలా లేదా ఏదైనా సంస్థకు అప్పజెప్పాలా అనే సందిగ్ధంతలో ఉంది. కార్డులు ఎప్పుడు ముద్రిస్తారా మాకు ఎప్పుడు వస్తాయో అంటూ వాహనదారులు మండిపడుతున్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

- అడ్డుకున్న గ్రామస్తులు, కనిపించని రెవెన్యూ అధికారులు



భూమిని చదును చేసేందుకు చెట్టూ పుట్ట తొలగిస్తున్న జేసీబీ

వరికుంటపాడు: ఖాళీ భూములు కనిపిస్తే అంగబలం, ఆర్థిక బలం ఉన్నోళ్లు విలువైన ప్రభుత్వ భూములు కాజేస్తున్నారు. తాజాగా మండలంలోని తూర్పుబోయమడుగుల అలివేలు మంగాపురం రెవెన్యూ పరిధిలో బీసీ కాలనీకి ఆనుకొని తారురోడ్డు పక్కనే ఉన్న సర్వే నంబరు 140, 141లోని విలువైన ప్రభుత్వ భూమి ఉంది. ఇక్కడ ఎకరం భూమి రూ.5 లక్షలపైమాటే. స్థానికేతరుడైన పావులూరి మాల్యాద్రి అనే వ్యక్తి ఇటీవల ఈ భూమికి పక్కనే కొంత భూమిని కొనుగోలు చేశాడు. తాజాగా దాని పక్కనే ఉన్న సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు మంగళవారం జేసీబీలతో ముళ్లచెట్లు తొలగిస్తూ, భూమిని చదును చేశారు. మండల రెవెన్యూ అధికారులు, స్థానిక అధికార పార్టీ నేతల సహకారం లేకుండా అతను ఇంత సాహసం చేయగలడా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికులకు ఈ విషయం తెలియడంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. 'మేము ఇక్కడ పుట్టి పెరిగినా మా గ్రామంలో మాకు ఒక్క గజం భూమి కూడా లేదు. అలాంటిది ఎక్కడి నుంచో వచ్చిన వ్యక్తి తనకు ఉన్న భూమితో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కూడా ఎలాంటి పత్రాలు లేకుండా ఆక్రమించడం అన్యాయం అని మండిపడ్డారు. భూ ఆక్రమణపై గ్రామస్తులు రెవెన్యూ సిబ్బందికి తీసుకెళ్లినా కనీసం స్పందించి అటువైపు కూడా రాలేదు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి కబ్జాను ఆపి ప్రభుత్వ భూమిని రక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

జెడ్పీలో ఉద్యోగోన్నతులు, కారుణ్య నియామకాలు



పదోన్నతుల పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓ మోహన్‌రావు

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న 17 మంది ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించారు. జెడ్పీలో పని చేస్తూ మరణించిన ఇద్దరు ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియమకాల కింద ఉద్యోగావకాశాలు కల్పించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు మంగళవారం అందజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ మాట్లాడుతూ తాను బాధ్యతలు స్వీకరించిన 2021 నుంచి ఇప్పటి వరకు 137 మంది ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు, 83 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. ఈ నెలఖారులోపు 25 మంది రికార్డు అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్కాకుల పెంచలయ్య, వి దేవప్రసన్నకుమార్ చైర్‌పర్సన్ అరుణమ్మ, సీఈఓ మోహన్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ అధికారులు రవికుమార్, సుబ్రహ్మణ్యం, వాసుదేవరావు, ఉద్యోగులు ముజీర్, అనిల్‌కుమార్, భీమ్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.4 కోట్ల చావిడి స్థలానికి ఎసరు

- నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్‌కు విఫలయత్నం
- ఆ స్థలం గ్రామ చావిడిగా దశాబ్దాలుగా రెవెన్యూ రికార్డుల్లో..
- న్యాయపరమైన చిక్కులు లేకుండా తిరుపతి జిల్లా తహసీల్దార్ సలహాలు
- సదరు అధికారి అండదండలతో స్థలం కబ్జాకు కుయుక్తులు



పట్టణ నడిబొడ్డున ఉన్న విలువైన స్థలం (కూరగాయాల దుకాణం వెనుకున్న స్థలం

సాక్షి టాస్క్‌ఫోర్స్: పొదలకూరు పట్టణ నడిబొడ్డున పోలీస్ స్టేషన్, బిట్-2 సచివాలయం బిల్డింగ్ మధ్యలో ఉన్న రూ.4 కోట్ల విలువైన 34 అంకణాల ప్రభుత్వ స్థలాన్ని ప్రస్తుతం తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న ఓ తహసీల్దార్ సహకారంతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కొట్టేసేందుకు ఆ వ్యక్తి విఫలయత్నమయ్యాడు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చివరి నిమిషంలో రికార్డుల పరిశీలనలో ఈ విషయం తెలియడంతో రిజిస్ట్రేషన్ ఆగిపోయింది. సదరు తహసీల్దార్ తనకు స్వయాన బావమరిది అయిన వ్యక్తితో కలిసి ప్రభుత్వ భూమిని కాజేసే కుట్రకు బరి తెగించాడు. ప్రభుత్వ స్థలాన్ని తన బావమరిదికి కట్టబెట్టేందుకు ఆ స్థలాన్ని పిత్రార్జితంగా మార్చేందుకు డెత్ సర్టిఫికెట్లతో నకిలీ పత్రాలను సృష్టించారు. అయితే డాక్యుమెంట్లు నియమాలకు విరుద్ధంగా ఉన్నాయని గుర్తించి సబ్ రిజిస్ట్రార్ తిరస్కరించారు. అయితే న్యాయస్థానాన్ని ఆశ్రయించి విలువైన స్థలాన్ని దక్కించుకునేందుకు ఆ వ్యక్తి ప్రయత్నిస్తున్న వైనం తాజాగా బయటపడింది.

దశాబ్దాలుగా చావిడి స్థలంగా రెవెన్యూ రికార్డుల్లో

పోలీస్‌స్టేషన్ పక్కనున్న సర్వే నంబరు 191- 1ఏలోని 34 అంకణాల స్థలం దశాబ్దాలుగా రెవె న్యూ రికార్డుల్లో గ్రామ చావిడి భూమిగా ఉంది. ప్రస్తుతం ఈ స్థలం విలువ బహిరంగ మార్కె ట్లో రూ.4 కోట్ల వరకు పలుకుతోంది. దాదాపు పదేళ్ల క్రితం వరకు ఇక్కడ చావిడి ఉండేది. ఈ స్థలంలో వీఆర్వోలు తమ విశ్రాంతి గదులను నిర్మించుకునేందుకు ప్రయత్నించడంతో అప్పట్లో పెద్ద గొడవ కూడా జరిగింది. ఈ స్థలం రెవెన్యూదా? లేక పంచాయతీరాజ్‌దా? తేల్చుకునేందుకు రెండు శాఖల అధికారులు పెద్ద కసరత్తు కూడా చేశారు. స్థల వివాదంపై అప్పట్లో వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రవిశేఖర్, అప్పటి సర్పంచ్ నిర్మలమ్మ, ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య మధ్య వివాదం నెలకొని పోలీసు కేసులు కూడా అయ్యాయి. ఈ అంశంపై కోర్టును ఆశ్రయించడంతో అక్కడ రెవెన్యూ భవనం నిర్మించుకునేందుకు కోర్టు అనుమతి ఇవ్వడంతో భవనం నిర్మించుకునేందుకు కలెక్టర్ నుంచి అనుమతులు కూడా పొందారు.

పిత్రార్జితమంటూ రంగంలోకి..

అయితే పట్టణానికి చెందిన విజయకుమార్ అనే వ్యక్తి ఆ స్థలం తమ పిత్రార్జితమని 2023 సెప్టెంబరులో రంగంలోకి దిగాడు. డెత్ సర్టిఫికెట్లు తయారు చేసుకుని ఆ స్థలాన్ని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయాలని సబ్‌రిజిస్ట్రార్ వద్దకు వెళ్లి తన వద్ద ఉన్న నకిలీ డాక్యుమెంట్లను సమర్పించాడు. సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్లు నియమ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని అనుమా నం వచ్చి నిలిపివేశారు. అయితే విజయకుమార్ ఎలాగైనా విలువైన స్థలాన్ని దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. దీనిపై రెవెన్యూ అధికారులు చొరవ తీసుకుని వెంటనే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి విలువైన స్థలాన్ని కాపాడాల్సిందిగా పట్టణ ప్రజలు కోరుతున్నారు.